


నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

ప్రజాశక్తి-విజయనగరం

అఖిల భారత డ్వాక్రా బజార్ పేరుతో దేశ వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డును ఆనుకొని మాన్సాస్ గ్రౌండ్స్‌లో (పెద్ద చెరువు గట్టు కింద) డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఈ బజార్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభించనున్నారు. మన రాష్ట్రంలోని 26 జిల్లాలతో పాటు తెలంగాణ, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులు పాల్గొంటాయి. సుమారు 250 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన 28వ తేదీ నుంచి నవంబరు 8వ తేదీ వరకు జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలు వరకు స్టాల్స్ తెరిచి ఉంటాయి.

చంద్రబాబుకు ఓటు.. అభివృద్ధికి చేటు

సామాజిక సాధికార బస్సుయాత్రలో మంత్రులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

చంద్రబాబు నాయుడుకు ఓటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి, మన పిల్లలు భవిష్యత్ కు చేటు అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఉప ముఖ్యమంత్రులు బుడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వైసిపి నాయకులు చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చేరుకుంది. తొలుత గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో వేలాది మంది కార్యకర్తలు, నాయకులు బస్సు యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం మెంటాడ రోడ్డులో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ నాలుగేళ్ళ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు చేసిన మేలు గురించి వివరించేందుకు సామాజిక సాధికారిత బస్సు యాత్ర చేపట్టామన్నారు. ఐదేళ్ల క్రితం తమకు ఓటు వేస్తే బ్యాంక్ రుణాలు రద్దు చేస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశాడన్నారు. జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేశామని, రైతులకు రైతు భరోసా కింద రూ.13వేలు ఇచ్చామని తెలిపారు. సచివాలయాల ద్వారా ఎటువంటి అవినీతి లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన తమ ప్రభుత్వానిదని అన్నారు. విద్యుత్తు బిల్లులు ఒక్క మన రాష్ట్రంలోనే పెరగలేదని, దేశమంతా పెరిగాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు కల్పించామన్నారు. ప్రజా ధనం తినడం వల్లే చంద్రబాబును సిబిఐ అరెస్టుచేసిందన్నారు. విశాఖను రాజధానిని చేస్తామంటే చంద్రబాబు అడ్డుకుంటున్నారన్న విషయం ప్రజలు గ్రహించాలన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే మన పిల్లాడి పీక మనమే కోసినట్లనని అన్నారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ మన జీవితాలు, సామాజిక పరిస్థితులు ఎలా మారాయనేది చూడాలని, జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పీడిక రాజన్నదొర మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు రాజ్యాధికారం లో భాగస్వామ్యం కల్పించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడైనా వెనుకబడిన కులాలను ఆదుకున్నారా అని ప్రశ్నించారు. బాబు వస్తే జాబ్ అన్నాడు ఇచ్చాడా అని ప్రశ్నించారు. 99 శాతం హామీలను అమలు చేసిన జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు.



బహిరంగ సభకు హాజరైన జనం

పేదలు అభివృద్ధి జగన్ తోనే సాధ్యం

పేదల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. 2024లో మరలా మన ముందుకు మోసగాళ్ళు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పంచాయతీరాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా అందించిన ప్రభుత్వం తమదని అన్నారు.

సభలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు శంబంగి చిన అప్పలనాయుడు, కడిబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, బడుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ

విజయనగరం టౌన్ : విజయనగరం చేరుకున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు నియోజకవర్గంలో అపూర్వ ఆదరణ లభించింది. బస్సుయాత్రకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని తన నివాసం వద్ద నుంచి కోలగట్ల జెండా ఊపి ప్రారంభించారు. వందలాది ద్విచక్ర వాహనాలతో బస్సు యాత్రతోపాటు అంబేద్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్అండ్‌బీ, కలెక్టరేట్ మీదుగా గొట్లాం వరకూ ర్యాలీ సాగింది. జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సంగంరెడ్డి బంగారునాయుడు, జి.ఈశ్వర్ కౌశిక్, ఇతర యువజన విభాగం నాయకులు, కార్పొరేటర్లు స్వయంగా వాహనాలు నడుపుతూ ర్యాలీలో ముందుకు సాగారు. అనంతరం గొట్లాం నుంచి బస్సు యాత్ర గజపతినగరం బయల్దేరింది.



మాట్లాడుతున్న ఇఐడి ప్యారీ సుగర్స్ ప్రతినిధి పట్టాభిరామ్

చెరకు టన్ను మద్దతు ధర రూ.3,080

30న చెరకు క్రషింగ్ ప్రారంభం ● ఇఐడి ప్యారీ సుగర్స్ యాజమాన్యం ప్రకటన

ప్రజాశక్తి- రేగిడి

చెరకు టన్ను మద్దతు ధర రూ 3,080లకు ఈ ఏడాది పెంచామని ఈనెల 30న చెరకు క్రషింగ్ ప్రారంభిస్తామని ఇఐడి ప్యారీ సుగర్స్ అసోసియేట్ సీనియర్ ఉపాధ్యక్షులు పట్టాభి రామ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సంకిలి ప్యారి సుగర్స్ కర్మాగారంలో స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. గతేడాది చెరకు టన్ను మద్దతు ధర రూ.2,980లు ఇవ్వగా ఈ ఏడాది వంద రూపాయలు పెంచుతూ 3,080 లకు పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ ఆడేందుకు యాజమాన్యం నిర్ణయించినట్లు వెల్లడించారు. గతేడాది 4.77 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ ఆడినట్లు వివరించారు. జిల్లాలో 2,564 ఎకరాల్లో మొక్క, 8,493 ఎకరాల్లో మమ్ము మొత్తం 11,057 ఎకరాలలో సాగు జరిగినట్లు పేర్కొన్నారు. కొత్తగా చెరకు నాటిన రైతులకు భారీగా రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023-24 ఏడాదికి సంబంధించి అక్టోబర్ 2023 నుంచి 2024 సెప్టెంబర్ వరకు యాజమాన్యం సూచించిన రకాలు, చెరకు సాళ్ల మధ్య 4 అడుగులు దూరం నాటిన రైతులకు రూ.12,000 రాయితీ ఇస్తామన్నారు. 4 అడుగులు కంటే సాదా పద్ధతిలో నాటిన రైతులకు 11,000 రూపాయలు రాయితీ ఇస్తామన్నారు. మమ్ము పద్ధతిలో సాగు చేసే రైతులకు రూ.2500 రాయితీ ఇస్తామని వెల్లడించారు. మొక్క రాయితీ పొందడానికి రైతులు ఒక ఎకరం నుండి 30 టన్నులు చెరకు సరఫరా చేయాలని వెల్లడించారు. అలా కానీ ఎడల 25 టన్నుల వరకు దామాస పద్ధతిలో రాయితీ వర్తిస్తుందన్నారు. 25 టన్నుల కంటే తక్కువ సరఫరా చేస్తే రాయితీ వర్తించదని స్పష్టం చేశారు. మమ్ము తోటలకు సంబంధించి ఒక ఎకరా నుంచి 25 టన్నులు చెరకు సరఫరా చేయాలన్నారు. కానీ ఎడల 20 టన్నుల వరకు దామాషా పద్ధతిలో రాయితీ వర్తిస్తుందన్నారు. 20 టన్నుల కంటే తగ్గిన రైతులకు రాయతీ వర్తిందన్నారు. జీడి, మామిడి తోటలను తొలగించి చెరకు నాటిన రైతులకు అదనంగా ఎకరానికి రూ.5వేలు రాయితీ ఇస్తామన్నారు. యాజమాన్యం సూచించిన విత్తనాలు మాత్రమే నాటాలని కోరారు. ఇప్పటికే తుని, కర్ణాటక నుంచి 140 చెరకు నరుకు బంటాలను సిద్ధం చేశామన్నారు. సాళ్ల మధ్య దూరం నరుకుటకు 5 ఆధునాతన వాహనాలను రప్పించామన్నారు. రైతులు ఈ ఏడాది నాణ్యమైన చెరకు సరఫరా చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా కటింగ్ ఆర్డర్లు ఆయా డివిజన్ కర్మాగార ఉద్యోగులను కలవాలన్నారు. వచ్చే ఏడాది చెరకు విస్తరణ పెంచేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎవిపితో పాటు కేన్ ఎజిఎం రాజేంద్రన్, హెచ్ ఆర్ మేనేజర్ వి. మురళీకృష్ణ, ఫైనాన్సర్ మేనేజర్ పి శ్యామ్ కుమార్ ఉన్నారు.

ఆరోగ్యశ్రీకి తూట్లు!

- పరీక్షల పేరుతో డబ్బులు వసూలు
- మేడిపండు చందంగా వైద్య సేవలు
- పేదరోగులను పిండుతున్న ప్రయివేటు ఆస్పత్రి
- పట్టించుకోని వైద్యాధికారులు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఉన్న ఏకైక ప్రయివేటు ఆసుపత్రి పేదల పాలిట శాపంగా మారుతోంది. ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు మేడిపండు చందంగా ఉన్నాయి. నిపుణులైన వైద్యులు లేకుండానే ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఫిలిడెల్ఫియా ఆసుపత్రికి వైద్య సేవల కోసం వెళుతున్న నిరుపేద రోగులకు చేతి చమురు వదులుతోంది. వైద్య పరీక్షల పేరుతో ఆసుపత్రి యాజమాన్యం డబ్బులు పిండుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందజేసే ఆసుపత్రుల్లో వైద్యంతోపాటు వైద్య పరీక్షలు కూడా ఉచితంగానే నిర్వహించాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద నమోదైన రోగుల నుంచి పరీక్షలకు డబ్బులు తీసుకోవడం వివాదాస్పదమవుతోంది. అన్ని రకాల వైద్య పరీక్షలతోపాటు శస్త్రచికిత్స, ఇతర వైద్య సేవలకు రాష్ట్ర ప్రభుత్వమే డబ్బులు మంజూరు చేస్తుంది. కానీ ఈ ఆసుపత్రిలో నిబంధనలకు విరుద్ధంగా నిరుపేద రోగుల నుంచి పరీక్షలకు డబ్బులు గుంజుకుంటున్నారని రోగుల బంధువులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో ఒక్క గైనకాలజిస్ట్ మాత్రమే రెగ్యులర్‌గా ఉంటున్నారు. మిగిలిన వైద్యులను అద్దె ప్రాతిపదికన తీసుకొచ్చి సేవలందిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కె.మురళీకృష్ణ అనే యువకుడు ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద వారం రోజుల క్రితం నమోదయ్యారు. ఆయన నుంచి వైద్య పరీక్షల పేరుతో రూ.1430 వసూలు చేశారు. ఆరోగ్యశ్రీలో వైద్య పరీక్షలు ఉచితం కదా? అని యువకుడి బంధువులు అడిగితే విజయనగరం, విశాఖపట్నం వెళ్లిపోవాలని ఆసుపత్రి సిబ్బంది బెదిరించారు. గంటల ప్రాతిపదికన బయటి నుంచి డాక్టర్లను తెచ్చుకుని ఆసుపత్రి యాజమాన్యం ఆరోగ్య శ్రీ పథకం కింద నామమాత్రపు సేవలు అందిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందాలనుకునే నిరుపేద రోగులకు మెరుగైన సేవలు అందించే వైద్యులు లేకుండా బాగోతం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రి తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. తక్షణమే ఆసుపత్రి యాజమాన్యం దోపిడీని నియంత్రించాలని నిరుపేద రోగులకు కోరుతున్నారు.



నిబంధనలు పాటించని ప్రయివేటు ఆస్పత్రి

జగనన్నకు చెబుదాంలో వినతుల వెల్లువ

అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయిలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వినతులు వెల్లువలా వచ్చాయి. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, ఆర్‌డిఒ ఎం.లావణ్య ప్రజల నుంచి 85 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

సాగునీటి వనరులు అభివృద్ధి పరచాలని, ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని వినతులు అందాయి. డుమ్మంగి, బొద్దిడి గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని, గుమ్మలక్ష్మీపురంలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇవ్వాలని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు కోరారు. ఇరిడి, పెద్దఖర్జ పంచాయతీలోని గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రోడ్డు మంజూరు చేయాలని కద్రక. మల్లేశ్వరరావు, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు. మంగళాపురంలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన చెక్‌డ్యామ్ దెబ్బతిందని, దీంతో వ్యవసాయ భూములకు సక్రమంగా నీరు అందక ఇబ్బంది పడుతున్నామని, చెక్ డ్యామ్ మరమ్మతులు పూర్తి చేయాలని మండంగి నాగేశ్వరరావు, రైతులు అర్జీ అందించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం మండలం సంధిగూడ గ్రామానికి పాఠశాల, అంగన్వాడీ భవనం లేక గ్రామంలో ఉన్న చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని బి.క్రిష్ణ వినతి పత్రం సమర్పించారు. కేదారిపురం పంచాయతీ కె.డి కాలనీ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే బాగుచేయాలని ఎ.భారతి కోరారు. కేదారిపురం గ్రామానికి చెందిన పి. జానకి జగనన్న గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన మండంగి మాణిక్యం మూడేళ్ల నుంచి పింఛను, రేషన్ రావడం లేదని వినతి సమర్పించారు. తాడికొండ గ్రామానికి చెందిన ఎ.చిన్నారావు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా సబ్సిడీ రుణాన్ని మంజూరు చేయవలసిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, స్కూల్ ఎడ్యుకేషన్ ఎడి ఎం.ఇ.రాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.మల్లికార్జున, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి కె.వి.ఎన్.రెడ్డి, జిల్లా పశు సంవర్ధక అధికారి జె.రత్నాకర్, బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, ఎల్‌డిఎం జెఎల్ఎన్ మూర్తి, తహశీల్దార్ రాములమ్మ, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించుటకు పట్టణానికి చెందిన పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. ఎఆర్ అధికారులు, సిబ్బంది పోలీసుశాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, అత్యాధునిక పరికరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుశాఖ ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, వివిధ రకాల ఆయుధాలను విద్యార్థులకు చూపించి, వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి జి.మురళీధర్, ఎస్‌బి సిఐ సిఎచ్.లక్ష్మణరావు, ఎఆర్ ఆర్ఐ కుమార్, శ్రీరాములు, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

ఎస్‌పి కార్యాలయంలో పోలీసు ఉద్యోగులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ - సామాజిక పాత్ర అంశంపై వ్యాసరచన, సోషల్ మీడియా దుర్వినియోగం సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావంపై వక్తృత్వ పోటీలు జరిగాయి.

వినోదానికి వెళ్తే జేబులు ఖాళీ

ఫారెన్ సిటీ ఎగ్జిబిషన్ నిర్వాహకుల దోపిడీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో బైపాస్ రోడ్‌కి ఆనుకొని శ్రీసూర్య ఆదిత్య ట్రేడ్ ఫర్ నిర్వాహకులు ఫారెన్ సిటీ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను చూసేందుకు వచ్చిన సామాన్యులను దోపిడీ చేస్తున్నారని, వినోదానికి పోతే జేబులు ఖాళీ అయ్యే పరిస్థితి వస్తుందని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుం రూ.50, గ్రౌండ్‌లో ఉన్న ఏ యంత్రంపైకి ఎక్కాలన్నా రూ.100 టిక్కెట్ వసూలు చేస్తున్నారని తెలిపారు. గ్రౌండ్ లోపల తాగునీరు ఏర్పాటు చేయలేదని, మహిళలకు, పిల్లలకు మరుగుదొడ్లు లేవని చెప్పారు. ప్రమాదం జరిగితే మెడికల్ కిట్లు లేవని, అగ్నిప్రమాద నివారణ చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఎక్కడా ధరల పట్టిక లేదని, ఆరోగ్యానికి హాని కలిగించే నాసిరకమైన తిను పదార్థాలు అమ్ముతున్నారని తెలిపారు. ఇన్ని లోపాలున్నా మున్సిపాలిటి, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు అనుమతులను ఏ విధంగా ఇచ్చారని ప్రశ్నించారు. వినోదం కోసం వెళ్లే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. కనీస మౌలిక సదుపాయాలు లేక పోవడంతో చిన్నపిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నిర్వాహకులపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



ఫారెన్ సిటీ ఎగ్జిబిషన్

30న పార్వతీపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురంలోని భాస్కర్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ ఫిట్టర్, బికాం కంప్యూటర్స్, బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ, డిప్లొమో మెకానికల్ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు, 27 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. 30న ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



ఆడలి వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ

పర్యాటక పనులు వేగవంతం

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆడలి వ్యూపాయింట్, గిరిజన మ్యూజియం, జగతిపల్లి రిసార్ట్స్ పనులను పరిశీలించారు. ఆడలి వ్యూ పాయింట్, గిరిజన మ్యూజియం పనులను నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. జగతిపల్లి రిసార్ట్స్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని అన్నారు. ప్రతిరోజూ పని జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ సింహాచలం, ఎఇలు మోహన్ గోపాల్, నాగభూషన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల గొంతు కోసిన ప్రభుత్వం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

లక్షలాది మంది నిరుద్యోగుల గొంతులను వైసిపి ప్రభుత్వం కోసిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి అన్నారు. శుక్రవారం టిడిపి పట్టణ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయలేదని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో యువత పెడదారి పడుతున్నారని తెలిపారు. వాలంటీర్ ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు విశ్వప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ ఒకటో తేది నుంచి ప్రారంభం కానున్న బాబు షూరిటీ - భవిష్యత్తుకి గ్యారెంటీ అన్న కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పాచిపెంట మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు పాల్గొన్నారు.



బాబు షూరిటీ- భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

నేడు వాల్మీకి జయంతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతిని శని వారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవానికి వెనుకబడిన తరగతులకు చెందిన సంఘ నాయకులు, సభ్యులు, ప్రజలు హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

నేడు వైసిపి మండల సమావేశం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలోని బిఎస్ఆర్ కళ్యాణ మండపంలో శనివారం వైసిపి మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కె.దీనమయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి హాజరవుతున్నారని తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

గుమ్మలక్ష్మీపురంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మన్ రాజు తెలిపారు. పంచాయతీ పరిధిలో ప్రజలంతా హాజరై వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు.


ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ షణ్ముఖరావు

ప్రకృతి సాగు.. లాభాలు బహు బాగు

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరావు తెలిపారు. శుక్రవారం మండలంలో దురిబిలి గ్రామంలో ఆరిక నరసమ్మ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యం కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా, సహజ సిద్ధంగా లభించే వనరులను, జీవామృతాలను ఉపయోగించి, ఆరోగ్యకరమైన, నాణ్యమైన అహార ఉత్పత్తులను పండించుకోవాలన్నారు. రైతులు తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు, అధిక ఆదాయం వచ్చేటట్లుగా అన్నిరకాల ఆకు, కూరగాయలు, దుంపజాతులు, తీగ జాతులు ఎటిఎం నమూనాలో సాగుచేయాలన్నారు. ఇలా చేస్తే ఎకరానికి సుమారు రెండు లక్షలు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, రైతులు ప్రసాద్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

షటిల్ శిక్షణకు చక్రవర్తి ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా షటిల్ శిక్షణకు కురుపాం గ్రామానికి చెందిన యువకుడు పి.చక్రవర్తి ఎంపికయ్యాడు. చక్రవర్తి తండ్రి నాగభూషణ షటిల్ సీనియర్ క్రీడాకారుడు. ప్రస్తుతం జెకె షటిల్ క్లబ్ కోచ్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కుమారులనూ షటిల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం చక్రవర్తి షటిల్ శిక్షణకు ఎంపికవడంతో క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

పొలంగూడ గ్రామంలో నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యాధికారి అభినవ కుమార్ సీజనల్ వ్యాధులపై ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. జ్వరాల లక్షణాలు, మలేరియా ఎలా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ముందస్తు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి వివరించారు. జ్వరాలు వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని, అంతేతప్ప పసర మందులు వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పాఠాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పి.కోనవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై ఎఒ కె.తిరుపతిరావు అవగాహన కల్పించారు. శుక్రవారం పి.కోనవలస క్లస్టర్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను ఉపాధ్యాయులు జానకి ఆధ్వర్యాన విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ తిరుపతిరావు అజోల్ల తయారీ, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం సిఆర్‌పిలు సురేష్, విజయ ఆధ్వర్యంలో ఆకుచుట్టు పురుగు, కాండం తొలుచు పురుగుల నివారణకు ఉపయోగపడే పంచపత్ర కషాయం తయారీని వివరించారు.

గ్రామాల్లోనే పనులు

ప్రజాశక్తి-వీరఘట్టం

వలసలు నివారించేందుకు వీలుగా ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లోనే పనులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ మెరుగల భవాని అన్నారు. శుక్రవారం మండలంలోని రేగులపాడు గ్రామంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2024 -25 ఆర్థిక సంవత్సరం సంబంధించి గ్రామంలో రూ.88 లక్షలతో 39 పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, సచివాలయ కార్యదర్శి నిర్మల పాల్గొన్నారు.

గర్భిణుల వసతిగృహ సందర్శన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని డిఎస్‌డిఒ సాయి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. గర్భిణులకు పెడుతున్న ఆహారాన్ని వారితో కలిసి తిని రుచిచూశారు. ఆరోగ్యం జాగ్రత్తగా ఉండాలని కోరారు.

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ ఉన్నత పాఠశాలల పిడిలు, పిఇటిలకు శుక్రవారం ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలన్నింటికీ ఈ సామగ్రి పంపిణీ చేస్తామని తెలిపారు.

సులభ పద్ధతిలో బోధించాలి

ప్రజాశక్తి-సీతంపేట


పుస్తకాలను పంపిణీ చేస్తున్న డిడిఇఒ లిల్లీరాణి

విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యను బోధించాలని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి తెలిపారు. శుక్రవారం న వ ం బ. ా ష వాలంటీర్లకు సవర భాషా పుస్తకాలను పంపిణీ పంపిణీ చేశారు. విద్యార్థులకు వాటిని అందజేయాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, సవరభాష విద్యా వాలంటీర్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.డొంబు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద అలబోను లక్ష్మణ్ తల్లి అలబోను రామాయమ్మ మూడో వర్ధంతి సందర్భంగా 50 మందికి దుస్తులు, దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. గ్రంథాలయంలో పెంకి ప్రసాద్, రాజు, ఆనంద్, నారాయణరావు సిమెంట్ బల్లలను ఏర్పాటుచేశారు. వీరికి గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కపోలు సాయినంద, రాంబాబు పాల్గొన్నారు.

కేంద్రంపై పోరుకు సిద్ధం కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి -గరుగుబిల్లి



గరుగుబిల్లి.. మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఉల్లిభద్ర జంక్షన్ వద్ద సిపిఎం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు ప్రజలలో అసమానవతలను సృష్టిస్తున్నాయని చెప్పారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లే విధంగా పాలకుల విధానాలు ఉన్నాయని విమర్శించారు. విద్యుత్తు రంగంలో సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల నడ్డివిరిచారన్నారు. అన్ని నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలకు భారంగా మారాయని ఆందోళన వ్యక్తంచేశారు. సాగునీరు అందించక, రైతులు పండించే పంటలు కొనుగోలు చేయక వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశారని విమర్శించారు. విభజన చట్టంలోని హామీలను బిజెపి అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపిని నిలదీయాల్సిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రానికి దాసోహమై, రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధి సాధనకు సిపిఎం ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగానే ఈ నెల 30న కురుపాంలో జరిగే బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని, ఈ సభకు ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరణం రవీంద్ర, బివి రమణ, దాసరి వెంకటనాయుడు, రెడ్డి సూర్యనారాయణ, బి.వెంకటి, ప్రసాద్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 30న పార్వతీపురంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ కోరారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు మున్సిపల్ కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. మూడో వార్డులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, పి.శంకర్రావు, సిహెచ్ సింహాచలం, జి.గంగరాజు, ఎం.శివ, గౌరమ్మ, జయమ్మ, గౌతమి, కామేశ్వరి, కొండమ్మ, పండుబాబు, వెంకటరమణ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కురుపాంలో ఈ నెల 30న జరిగే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. కొమరాడ మండల కేంద్రంలో మరడాన వీధిలో బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. అనంతరం విక్రమపురం, అర్తం, శివిని, గంగరేగువలస, కోటిపాం, జంఝావతి సెంటర్‌లో ప్రచారం చేశారు. భవన కార్మికుల సంఘం నాయకులు యామక గౌరినాయుడు, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


కొమరాడ.. ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


కొమరాడ.. వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి-కొమరాడ

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలో పెదశాఖలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావుతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతీ కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అక్కడ నమోదు చేసిన ఆరోగ్య వివరాలు రికార్డులో తనిఖీ చేశారు. అక్కడ ప్రజలతో మాట్లాడి పలువురి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మందులు వినియోగించే విధానాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బరువు తక్కువ, రక్తహీనత ఉన్న వారికి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ శిబిరాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి, జనార్ధన నాయుడు, సర్పంచులు పీడిక రత్నాలమ్మ, పాలక వలసమ్మ, వైద్యాధికారులు బి.శామ్యూల్, అరుణ్ కుమార్, స్పెషలిస్ట్ వైద్యులు, ఎంఇఒ సిహెచ్.తిరుపతి, ఐసిడిఎస్ పిఒ ఎన్.అరుణ, పంచాయతీ సెక్రటరీలు రవీంద్ర, శేఖర్, నాయకులు ఆనందరావు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : కురుపాంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి శెట్టి పద్మావతి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులకు ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి నాయకుల షేక్ నూరేల్, ఆకుల శ్రీధర్, చంటి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : వీరఘట్టంలో నాలుగో సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు సందర్శించారు. ఈ శిబిరంలో సుమారు 500 మందికి పైగా వైద్యులు సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. ఆర్‌సిఎం పాఠశాలలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరానికి భారీగా రోగులు తరలివచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.గౌరమ్మ, తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ, ఇఒ వి.రామచంద్రరావు, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎ.మానస, వైవికె రమణ, ఎం.రాజేష్ కుమార్, కె.పల్లవి, వైద్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జనార్ధన్‌రావు, శాంతకుమారి, జె.జ్ఞానమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు భాగ్యరాధ, కావ్య పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఆర్ వెంకంపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎం.వి.రమణ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ శ్రీరాములనాయుడు, వైద్యులు కె.శిరీష, ఉషారాణి, సర్పంచ్ పంట శ్రీదేవి, సచివాలయ సిబ్బంది కె.కె.వర్మ పాల్గొన్నారు.


కురుపాం.. వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎంపిపి పద్మావతి


వీరఘట్టం.. మందులు పంపిణీ చేస్తున్న ఎంపిపి వెంకటరమణ

గిరిజనుల ఫిర్యాదుపై దర్యాప్తు

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని ఎగువశెంబి, దిగువశెంబి గిరిజనులు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు కొనసాగుతోందని రూరల్ ఎస్ఐ ప్రయోగ మూర్తి చెప్పారు. ఈ గ్రామాలకు చెందిన గిరిజన రైతుల నుంచి ఇద్దరు వ్యక్తులు డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. అయితే గిరిజన రైతులు డబ్బులు ఇచ్చినట్లు ఏ విధమైన ఆధారాలు లేవని చెప్పారు. వసూలు చేసిన వ్యక్తులు ఫోన్‌లో అందుబాటులోకి వచ్చారని, కేంద్ర ప్రభుత్వం ద్వారా గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసే ప్రక్రియ జరుగుతున్నదని వారు తెలిపినట్లు చెప్పారు. గతంలో ఫిర్యాదుదారుల సమక్షంలోనే వారితో ఫోన్‌లో మాట్లాడినట్లు ఎస్ఐ ప్రయోగమూర్తి చెప్పారు.

డిసెంబర్ 31లోగా సర్వే పూర్తి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఈ ఏడాది డిసెంబర్ 31లోగా జగనన్న భూ హక్కు రీసర్వే కార్యక్రమాన్ని పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని 41 రెవెన్యూ గ్రామాలకు గాను 21 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. 16 రెవెన్యూ గ్రామాలకు పట్టదారు పాస్‌పుస్తకాలు కూడా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కుమ్మరిగుంట, వీరఘట్టం, కంబర, విక్రంపురం, కత్తుల కవిటి, చిన్నగోర, కడకల్లా, కిమ్మీ, వండువ, చేబియ్యం వలస గ్రామాలలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసినప్పుడు ఒకరి పేరిట ఉన్న భూమి వేరొకరి పేరు మీద కనిపించడం వల్ల ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామన్నారు. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిన వెంటనే సరిచేస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పాలకొండ

విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని డిఎస్‌పి జివి కృష్ణారావు అన్నారు. ఉన్నత విలువలు కలిగిన విద్యపై దృష్టి పెట్టాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమని తెలిపారు. సత్ప్రవర్తన ఈ దశ నుంచి అలవాటు చేసుకోవాలన్నారు. మీరంతా భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలని చెప్పారు ఈ సందర్భంగా విద్యార్థులకు ద్రోహి సినిమా చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బి.శివప్రసాద్, పి.అనీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం


పార్వతీపురంరూరల్.. ఎండిన పంటను పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌చంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి సర్కారు.. రైతులను నట్టేట ముంచే విధంగా వ్యవహరిస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మండలంలోని దిబ్బగుడివలసలో నీరు లేక ఎండిపోయిన వరి పంటను టిడిపి బృందం పరిశీలించింది. వర్షాలు కురవక నీటి ఆధారం లేక పంటలు ఎండిపోయాయని, ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడితో వరి పంట ఎండిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యేలు, అధికారులు జిల్లాలో పర్యటించి పరిస్థితి అంచనా వేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉండగా, బస్సుయాత్రల పేరిట ప్రజలను ఏమార్చేందుకు సమయాన్ని కేటాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జిల్లాలోని కరువు పరిస్థితులను అంచనా వేసి, కరువు మండలాలను ప్రకటించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, బార్నాల సీతారాం, పోలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకుంటే, ఎమ్మెల్యేలు బస్సు యాత్ర చేయడం ఎంతవరకు సమంజసమని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ప్రశ్నించారు. గుమ్మలక్ష్మీపురంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో టిడిపి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు బస్సు యాత్ర చేపడితే వైసిపి నాయకులు హేళనగా మాట్లాడారని గుర్తుచేశారు. ఇప్పుడు వైసిపి చేపడుతున్న బస్సుయాత్రకు జనాలు లేక తుస్ యాత్ర అయిందని విమర్శించారు. పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు ఏర్పడుతున్నా, పొలాలకు సాగునీరు అందించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇదేనా రైతు ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు.

ఇ-క్రాప్ తప్పుల సవరణకు అవకాశం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఇ-క్రాప్ జాబితాలో రైతుల వివరాలు తప్పుగా నమోదైతే విఎఎల దృష్టికి తీసుకువస్తే ఈ నెల 29, 30వ తేదీల్లో సరిచేస్తామని ఎఒ విజయభారతి తెలిపారు. మండలంలో నాగూరు, రావివలస, తోటపల్లి, సంతోషపురం గ్రామాల్లో ఇ-క్రాప్ జాబితాలపై శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల రైతుభరోసా కేంద్రాల్లో ఇ-క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించారు. ఎఒ.మాట్లాడుతూ సాగుచేస్తున్న పంట, భూవిస్తీర్ణం, నీటి సదుపాయం వంటి వివరాలు సరిగా ఉన్నదీ, లేనిదీ సరిచూసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : ఇ-క్రాప్‌లో నమోదైన పంటల వివరాలను విధిగా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని వ్యవసాయ అధికారి ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు తెలిపారు. అరసాడ, బర్లి రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం గ్రామసభలు ఏర్పాటుచేశారు. ఇ-క్రాప్ జాబితాను పరిశీలించి, తప్పులుంటే సరిదిద్దుకునేందుకు రైతులకు చివరి అవకాశం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో విఎఎ ఐశ్వర్య, పోల రామకృష్ణ, గుల్ల రాజు, పాపినాయుడు, గుల్ల లక్ష్మణ పాల్గొన్నారు.

కొమరాడ : ఇ-క్రాప్ నమోదుతో రైతులకు అన్ని ప్రయోజనాలను వర్తిస్తాయని వ్యవసాయ శాఖ ఎడి ఎ.వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలో కంబవలస రైతు భరోసా కేంద్రంలో ఇ-క్రాప్‌పై గ్రామసభ ఏర్పాటుచేశారు. ఖరీఫ్ సీజన్లో మొత్తం 21,116 ఎకరాలకు ఇ-క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల వివరాలు తప్పుగా నమోదు చేసిట్లయితే గ్రామసభల్లో సరిదిద్దుకోవచ్చునని తెలిపారు. తుది జాబితా నవంబర్ 2న ప్రతీ రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పి.శంకరరావు పాల్గొన్నారు.


కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గిరిజన సంఘం నాయకులు తిరుపతిరావు, లక్ష్మణరావు

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పాచిపెంట

స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్‌డిఒ కె.హేమలత సందర్శించారు. మండలంలో గుర్తించిన అసైన్డ్ భూములకు సంబంధించి ప్రక్రియ వేగవంతం చేయాలని తహశీల్దార్ రాజశేఖర్‌ను ఆమె ఆదేశించారు. మ్యుటేషన్లకు సంబంధించి నిర్దిష్ట గడువులోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. మండలంలో 70 మంది రైతులకు సంబంధించి 80 ఎకరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచామని తహశీల్దార్ నివేదించారు. అంతకుముందు శ్యామలగౌరీపురం సమీపంలో బాణసంచా విక్రయ దుకాణానికి సాలూరు పట్టణానికి చెందిన ఒక వ్యక్తి పెట్టుకున్న అర్జీ మేరకు ఆమె స్థల పరిశీలన చేశారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

కొమరం భీమ్ వర్ధంతి

ప్రజాశక్తి-సీతంపేట

కొమరం భీమ్ 83వ వర్ధంతి సభను స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటుచేశారు. సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం నైజాం, బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన యోధుడు కొమరం భీమ్ అన్నారు.

గిరిజనుల స్వేచ్ఛ కోసం ఉద్యమం నడిపించారని తెలిపారు. సమావేశంలో బి.సాయి, ఎ.భాస్కర్‌రావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.డొంబు, ఎస్.ఆనంద్, మాసయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర జిల్లా పరిషత్తు పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న మరడ నారాయణరావు గుండెపోటుతో మృతి చెందారు. అరుణాచలం తీర్థయాత్రకు వెళుతుండగా సామర్లకోట వద్ద గుండెపోటు స్వల్పంగా రావడంతో కాకినాడ ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం చేరారు. మధ్యాహ్నం పరిస్థితి విషమించి ఆయన మరణించారు. నారాయణరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


నారాయణరావు (ఫైల్)

నేరాలు ఘోరాలు

బైక్ అదుపుతప్పి విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో విఆర్‌ఒ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని కొత్తవలస పంచాయతీ జనవరివలస వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన గంట జమ్మయ్య (43) సాలూరు మండలం తుండ పంచాయతీలో విఆర్‌ఒగా పనిచేస్తున్నారు. శుక్రవారం శంబర నుంచి సాలూరు వెళ్లే మార్గంలో జనవరివలస వద్ద రోడ్డుపై గుంతలను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో ఆయన తల రోడ్డును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపారు.


జమ్మయ్య (ఫైల్)